సమాచార సాంకేతికతలో .. వినూత్న ఆవిష్కరణలకు కృషి



- సీ డాక్ హైదరాబాద్ డైరెక్టర్ పీఆర్ లక్ష్మీఈశ్వరి

కొత్తపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సమాచార సాంకేతికతలో వినూత్న ఆవిష్కరణల కోసం సీ డాక్ అవిశ్రాంత కృషి చేస్తోందని ఆ సంస్థ హైదరాబాద్ డైరెక్టర్ పీఆర్ లక్ష్మీఈశ్వరి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ వారి సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్) హైదరాబాద్ 25వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను టెక్ కాన్‌క్లేవ్ కార్యాలయంలో మంగళవారం ఆమె ప్రారంభించారు. 1999 ఫిబ్రవరి 14న సీ డాక్ హైదరాబాద్‌ను స్థాపించారని గుర్తుచేశారు. ఆర్ అండ్ డీ, సొల్యూషన్స్ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, సర్వీసెస్, శిక్షణ, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. సైబర్ భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు వివిధ ఎంబెడెడ్ సిస్టంస్, ఇతర అంశాల్లో పీజీ డిప్లొమా కోర్సుల్లో శిక్షణా తరగతుల ద్వారా 20 వేల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు శిక్షణనిచ్చిందని ఆమె వివరించారు. బుధవారం ప్యానల్ డిస్కషన్స్, ప్రొడక్ట్ లాంచ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అధునాతన సాంకేతికతను సమాజానికి పరిచయం చేయడంతోపాటు పలు రాష్ట్రాల ప్రభుత్వ ప్రైవేటు సంస్థల అవసరాలకు అనుగుణంగా తగిన ఉత్పత్తులను సీ డాక్ అభివృద్ధి చేస్తోందని పేర్కొన్నారు.

స్నేహితుడిపై హత్యాయత్నం

- మద్యం బాటిల్‌తో విచక్షణారహితంగా దాడి



చికిత్స పొందుతున్న శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో స్నేహితుడిపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మలక్‌పేట గంజ్‌లో హమాలీలుగా పనిచేస్తూ ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న శ్రీనివాస్(28), జమీల్ స్నేహితులు. వీరిద్దరూ సోమవారం రాత్రి సెకండ్ షో సినిమా చూసేందుకు దిల్‌సుఖ్‌నగర్‌లోని కోణార్క్ థియేటర్‌కు వెళ్లారు. సినిమాకు వెళ్లడానికి ముందు మద్యం తాగారు. అనంతరం మరో నలుగురు మిత్రులతో కలిసి వీరిద్దరు సినిమాకు వెళ్లారు. ఇంటర్వెల్ సమయంలో బయటకు వచ్చారు. ఆ సమయంలో శ్రీనివాస్, జమీల్‌ల మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన జమీల్ సమీపంలో ఉన్న మద్యం బాటిల్ తీసుకుని శ్రీనివాస్‌పై దాడికి దిగాడు. దీంతో శ్రీనివాస్ మెడ తెగి తీవ్రరక్తస్రావమైంది. అక్కడి నుంచి తప్పించుకున్న శ్రీనివాస్ గంజ్‌కు వెళ్తుండగా మలక్‌పేట చర్మాస్ వద్ద స్పృహతప్పి పడిపోయాడు. అతన్ని గమనించిన స్థానికులు 100కు సమాచారం ఇచ్చారు. దీంతో చాదర్‌ఘాట్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి శ్రీనివాస్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం దాడి గురించి వెల్లడించాడు. చాదర్‌ఘాట్ పోలీసుల సమాచారంతో శ్రీనివాస్ నుంచి ఫిర్యాదు తీసుకున్న సరూర్‌నగర్ పోలీసులు జమీల్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

లుంబినీహిల్స్ కాలనీలో పార్కు కబ్జాను అడ్డుకోండి

- మున్సిపల్ కమిషనర్‌కు కాలనీవాసుల ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెంలోని లుంబినీ హిల్స్ కాలనీలో పార్కును ధ్వంసం చేసి కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు సోమవారం కమిషనర్ రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన పార్కుకు ఏర్పాటు చేసిన కంప్రెస్సింగ్‌తో పాటు హరితహారంలో భాగంగా నాటిన చెట్లను నరికివేశారని తెలిపారు. పార్కు స్థలాన్ని కబ్జా చేసి ప్రైవేటు స్థలంగా చిత్రీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన పార్కును ధ్వంసం చేసినవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సురకంటి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కోటేశ్వరరావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేకపిల్లల మందపై వీధికుక్కల దాడి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలో మేకపిల్లల మందపై వీధికుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 16 మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తట్టిఅన్నారం గ్రామానికి చెందిన నల్ల నర్సింహకు మేకల మంద ఉంది. అందులో 16 మేక పిల్లలు ఉన్నాయి. ఆదివారం సాయంత్రం మేకల మందను తన ఇంటి వద్ద మేకలను వాటి పిల్లలను కట్టేశాడు. అదే రోజు రాత్రి బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో అక్కడికి వెళ్లాడు. ఆ సమయంలో గ్రామంలోని వీధి కుక్కల గుంపు మేక పిల్లల మందపై దాడి చేశాయి. మంద వద్ద నుంచి వాటిని కొద్ది దూరం వరకు లాక్కెళ్లి విచక్షణారహితంగా కొరికి చంపేశాయి. రెండు గంటల తర్వాత నర్సింహ ఇంటికి తిరిగి వచ్చి చూడగా మేకపిల్లలు చెల్లాచెదురుగా పడి మృతి చెంది కనిపించాయి. రూ.లక్ష విలువ చేసే మేకపిల్లలు మృతి చెందాయని బాధితుడు నర్సింహ తెలిపారు. సోమవారం ఉదయం హయత్‌నగర్ పశువైద్యాధికారి ఆనంద్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. తీవ్రంగా నష్టపోయిన బాధితుడికి ప్రభుత్వం న్యాయం చేయాలని స్థానిక కౌన్సిలర్ దేవిడి గీతావేణుగోపాల్‌రెడ్డి కోరారు. వీధి కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులతో మాట్లాడి చర్యలుతీసుకుంటానని కౌన్సిలర్ గీతారెడ్డి తెలిపారు.


వనస్థలిపురం ఏసీపీ బదిలీ.. నూతన ఏసీపీగా పి.కాశీరెడ్డి నియామకం

వనస్థలిపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న భీమ్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల (డీసీఆర్‌బీ) డీఎస్పీగా బదిలీపై వెళ్లారు. ట్రాన్స్‌కో డీఎస్పీగా విధులుగా నిర్వహిస్తున్న పి.కాశీరెడ్డి వనస్థలిపురం ఏసీపీగా నియామకం అయ్యారు. వనస్థలిపురం ఏసీపీగా నియామకం అయిన కాశీరెడ్డి బుధవారం (నేడు) బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

సీపీఆర్‌పై డ్రైవర్లకు అవగాహన అవసరం

- ఆర్‌టీఓ సురేష్‌రెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా నాగోల్‌లోని బాబూ జగ్జీవన్‌రాం డ్రైవింగ్ పరీక్షా కేంద్రంలో మంగళవారం హెవీ వెహికిల్స్ నడిపే డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్ సూచనలతో నాగోల్ ఆర్టీఓ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రైవర్లకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అనుకోని సంఘటనల్లో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారికి సీపీఆర్ చేయాల్సిన తీరును ఈ సందర్భంగా ప్రయోగాత్మకంగా వివరించారు. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. సీపీఆర్ చేయటం ద్వారా క్షతగాత్రులను ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించాలని, ప్రమాద బాధితులకు మొదటి గంట చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు, ఎంవీఐలు శ్రీనివాస్, జి.ఆర్.రాజు, కె.రవీందర్‌రెడ్డి, సీతల్ చౌహాన్, సి.స్వప్న, రఘుకుమార్, బి.మానస, అనిత, సత్యనారాయణ పాల్గొన్నారు.



కమలానగర్ నూతన కమిటీ సభ్యులు

కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. నూతన అధ్యక్షులుగా టి.వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎం.గణేష్, ప్రధాన కార్యదర్శిగా టి.సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా బి.జ్యోతిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సి.దివాకర్ లింగం, కోశాధికారిగా కె.భరత్ సింగ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చెస్తామన్నారు. తమ ఎన్నికకు కృషి చేసిన కాలనీవాసులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బడంగ్‌పేట్ మునిసిపల్ వార్షిక బడ్జెట్ .. రూ.82.78కోట్లు



బడ్జెట్ ప్రతులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

- కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తెలిపిన పాలకవర్గం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రూ.82.78 కోట్ల అంచనాతో రూపొందించిన బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్‌కు మంగళవారం మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వ్యయ లెక్కల అనంతరం రూ.38.72 కోట్లను మిగులు బడ్జెట్‌గా పొందుపరిచిన అధికారులు 2023-24లో సవరించిన అంచనా ఆదాయం రూ.50 కోట్లతో కలిపి మొత్తం రూ.88.72కోట్ల అంచనాతో బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. సదరు బడ్జెట్‌లో త్వరలో ముగియనున్న ఆర్థిక సంవత్సరంలో (31.03.24 వరకు) రూ.56.71కోట్లు సాధారణ వ్యయంగా చూపించి ఏప్రిల్ 1, 2024 నాటికి మిగులు బడ్జెట్‌ను రూ.32.01కోట్లుగా పేర్కొన్నారు. కాగా రానున్న ఆర్థిక సంవత్సరంలో (2024-25లో) సాధారణ ఆదాయం రూ.60.35కోట్లు ఉండొచ్చునని అంచనా వేసి, దానికి మిగులు బడ్జెట్‌ను(32.01కోట్లను) జత చేసి మొత్తం ఆదాయాన్ని రూ.92.36 కోట్లుగా పేర్కొన్నారు. ఈ మొత్తం బడ్జెట్‌లో నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరంలో సాధారణ వ్యయ అంచనాను రూ.82.78 కోట్లుగా పేర్కొంటూ ఆ మేరకు తుది బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. ఆ లెక్కన 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి (31.03.25 నాటికి) కార్పొరేషన్ ఖజానాలో రూ.9.56కోట్లు మిగులు బడ్జెట్‌గా ఉంటుందని అంచనా వేశారు.

ఎస్ఎన్‌డీపీ నాలాలు, అభివృద్ధి పనులపై దృష్టి పెడతాం : మేయర్

రూ.82.78కోట్ల అంచనాతో రూపొందించిన వార్షిక బడ్జెట్ ఆధారంగా కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు మేయర్ పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణానికి ఇప్పటికే రూ.9కోట్లకు పైగా నిధులు వెచ్చించామని, మిగిలిన పనులు పూర్తిచేయడానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్టు ఆమె చెప్పారు. వచ్చే వానా కాలం నాటికి ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోనున్నట్టు ఆమె పేర్కొన్నారు. నూతనంగా వెలుస్తున్న కాలనీల్లోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తామని, ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెడతామని ఆమె తెలిపారు. ఈ వార్షిక బడ్జెట్ ఆమోదానికి సహకరించిన పాలకవర్గం సభ్యులకు, బడ్జెట్ రూపకల్పనలో సహకరించిన మునిసిపల్ అధికారులు, సిబ్బందికి మేయర్ పారిజాతారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్లు తోట శ్రీధర్‌రెడ్డి, సూర్లగంటి అర్జున్, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కమిషనర్ బి.సుమన్‌రావు, డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈలు బిక్యానాయక్, వినీల్‌గౌడ్, మేనేజర్ నాగేశ్‌బాబు, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నాలా పనులను త్వరగా పూర్తిచేయాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



సరూర్‌నగర్ చెరువు ఎగువ ఉన్న ఇన్‌లెట్‌ను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వరద ముంపు నివారణ కోసం ఎస్ఎన్‌డీపీలో భాగంగా చేపట్టిన నాలా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జీహెచ్ఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, అదనపు కమిషనర్ (లేక్స్) శివకుమార్ నాయుడులతో కలిసి సరూర్‌నగర్ చెరువు పరిసరాలలోని తపోవన్ కాలనీ, గ్రీన్‌పార్క్ కాలనీలలో కమిషనర్ పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. సరూర్‌నగర్ చెరువు అప్‌స్ట్రీమ్, ఇన్‌లెట్లను పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నాలా, బ్రిడ్జి వద్ద ఇరువైపులా పూడిక తీయాలని అధికారులను ఆదేశించారు. సరూర్‌నగర్ చెరువు అభివృద్ధి పనులపై లేక్స్ అధికారులతో చర్చించి అసంపూర్తి పనులను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. చెరువు సమీపంలోని గ్రీన్‌పార్క్‌కాలనీ, తపోవన్‌కాలనీల ఎఫ్‌టీఎల్ సమస్యను, హెచ్ఎండీఏ నిర్వహిస్తున్న సరూర్‌నగర్ చెరువులోకి కలిసే మురుగునీటిని శుద్ధి చేసే ఎస్‌టీపీని పూర్తిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో జీహెచ్ఎంసీ ఎస్ఈ (లేక్స్) ఆనంద్, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, ఎల్బీనగర్ ఎస్ఈ అశోక్‌రెడ్డి, సీపీ ప్రసాదరావు, ఉపకమిషనర్లు దశరథ్, అరుణకుమారి, ఎంటమాలజిస్ట్ రజని, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని .. 'వాసవి'పై కలెక్టర్‌కు ఫిర్యాదు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లోని సిరీస్ భూమిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న వాసవి కన్‌స్ట్రక్షన్ సంస్థపై చర్యలు తీసుకోవాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, రాష్ట్ర కోఆర్డినేటర్ కే.వీ.గౌడ్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సరూర్‌నగర్ మండలం బహదుర్‌గూడ గ్రామ సర్వే నెం.49/13లోని సుమారు 14 ఎకరాల 31 గుంటల భూమిని అప్పటి ప్రభుత్వం చాలా ఏళ్ల కిందట సిరీస్ కంపెనీకి కేటాయించిందన్నారు. సదరు భూమిని ఇటీవల వాసవి కన్‌స్ట్రక్షన్ కొనుగోలు చేసిందని, పక్కనే ఉన్న మరో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుందన్నారు. ప్రొహిబిటెడ్ ల్యాండ్ అని ధరణిలో చూపిస్తున్నా నిర్మాణాలు సాగుతున్నాయన్నారు. రెండేళ్ల కిందట అప్పటి జిల్లా కలెక్టర్ అక్రమంగా ఎన్ఓసీ ఇచ్చారని, దీనిపై గతంలోనూ తాము ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో అక్రమంగా జీహెచ్ఎంసీ ద్వారా అనుమతులు పొంది నిర్మాణాలు చేస్తున్నారన్నారు. అక్రమంగా బ్లాస్టింగ్ చేయటం ద్వారా వాసవి సంస్థ అధినేతపై ఎల్బీనగర్‌లో కేసు కూడా నమోదైందన్నారు. సమగ్ర సర్వే చేసి ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ఆపాలని, సదరు ఐదు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగుల వీల్‌చైర్ల తరలింపు

- ఎలక్షన్ సమయంలో కొనుగోలు

ఓల్డ్ మలక్‌పేట జనవరి 13(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని దివ్యాంగుల కార్పొరేషన్ కార్యాలయం నుంచి మంగళవారం దివ్యాంగుల వీల్‌చైర్లను తరలించారు అట్టపెట్టెల్లో ప్యాకింగ్ చేసి స్టోర్ చేసిన వీల్‌చైర్లను 6 డీసీఎం వాహనాల్లో నింపి శామీర్‌పేటకు తరలిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నిల కోసం వీటిని కొనుగోలు చేశారు. పోలింగ్ రోజు పోలింగ్‌స్టేషన్ల వద్ద దివ్యాంగుల కోసం వీటిని ఉపయోగించేందుకు గ్రేటర్ హైదరాబాదు పరిధిలో పంపిణీ చేయగా, మిగిలినవి మలక్‌పేటలోని దివ్యాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో భద్రపరిచారు. ఇక మిగిలిన వాటితో పనిలేక పోవడంలో తరలించే కార్యక్రమం చేపట్టారు. ఎన్నికలపుడు పంపిణీ చేయగా 2వేల వీల్‌చైర్లు మిగిలాయి ఒక్క చైర్ విలువ రూ.5 వేలు ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వాటి విలువ సుమారు 1 కోటి రూపాయల వరకు ఉంటుంది.

గతంలో ఆరోపణలు

వీల్‌చైర్ల కొనుగోలులో 2018 అసెంబ్లీఎన్నికల్లో అవినీతి జరిగినట్లు ఆరోపణలున్నాయి అవసరానికి మించి చైర్లు కొనుగోలు చేయడమే కాకుండా వాటి రేటులో కూడా అవినీతి జరిగినట్లు సంబంధిత కార్యాలయ సిబ్బంది బాహాటంగా పేర్కొంటున్నారు. ఈ అవినీతి వ్యవహారంపై గత ప్రభుత్వంలో విచారణ చేశారు. కానీ ఇంతవరకు విచారణలో ఏంతేలిందో ఇప్పటివరకు తెలియదని అంటున్నారు ఈసారి కూడా లెక్కకు మించి వీల్‌చైర్లు కొన్నట్లు తెలుస్తుంది. పంపిణీ చేశాక ఇంకా 2వేలు మిగలడం వెనుక మతలబు ఉంటుందని సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు.

కుటుంబ కలహాలతో కూలీ ఆత్మహత్య



కాలిన గాయాలతో మృతి చెందిన రమేష్

హయత్‌నగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల నేపథ్యంలో మనస్థాపానికి గురైన ఓ కూలీ ఒంటిపైన పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన వ్యక్తిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడే మృతి చెందాడు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వెంకటాద్రిపాలెంకు చెందిన పల్లపు రమేష్ (35) మెయినాబాద్‌లో గ్రానైటు రాళ్లను కొట్టుకుని జీవనం సాగిస్తాడు. 40 రోజుల క్రితం రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వెనకాల ఉన్న ఆర్‌టీసీ సూపర్‌వైజర్ కాలనీకి వలస వచ్చి గుడిసె వేసుకుని జీవిస్తున్నారు. రమేష్‌కు భార్య విజయ, కూతురు(13), ముగ్గురు కుమారులు ఉన్నారు. రమేష్, ఆయన భార్యకు మధ్య తరుచూ గొడవలు జరుగుతుంటాయని రమేష్ సోదరుడు శ్రీనివాస్ తెలిపాడు. వారం రోజుల క్రితం ఈసీఐఎల్‌లో నివాసం ఉండే భార్య విజయ తరుపు బంధువులు రమేష్‌ను తీవ్రంగా కొట్టారని శ్రీనివాస్ చెప్పాడు. దీంతో రమేష్ కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదని శ్రీనివాస్ తెలిపాడు. మంగళవారం ఉదయం పిల్లలను చూడడానికి రమేష్ ఈసీఐఎల్‌కు వెళ్లాడు. భార్య పిల్లలను చూపించకపోవడంతో మనస్థాపానికి గురైన రమేష్ హయత్‌నగర్‌కు వచ్చి మధ్యాహ్నం ఆర్‌టీసీ సూపర్‌వైజర్ కాలనీ వెనుక చెట్ల పొదల్లోకి వెళ్లి ఒంటిపైన పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. దీంతో తీవ్ర గాయాలకు గురైన రమేష్‌ను 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరుకోగానే రమేష్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

భర్త రెండో పెళ్లికి సిద్ధమయ్యాడని ఆందోళన



భర్త ఇంటి వద్ద పిల్లలతో కలిసి ఆందోళన చేస్తున్న పల్లవి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మగ సంతానం కోసం..మరో పెళ్లికి సిద్ధమై తనను పట్టించుకోవడం లేదంటూ కట్టుకున్న భర్త ఇంటి ముందు ఆమె న్యాయ పోరాటానికి దిగింది. తనతో పాటు ఇద్దరు ఆడ పిల్లలకు న్యాయం చేసే వరకు పోరాటం కొనసాగిస్తానంటూ ఆందోళన బాటపట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి... నాగోల్‌లోని జైపూర్‌కాలనీకి చెందిన తరిగొప్పుల అమరేందర్‌కు జనగాంకు చెందిన పల్లవితో 2017 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. వారసుడు కావాలని తాను మరొక పెళ్లి చేసుకుంటానంటూ గత కొద్ది రోజులుగా అమరేందర్ వేధిస్తున్నట్లు పల్లవి తెలిపింది. దానికి అతడి తల్లిదండ్రులు సైతం అమరేందర్‌కు మరోపెళ్లి చేసేందుకు గత కొంత కాలంగా ప్రయత్నిస్తున్నారని పేర్కొంది. నాలుగు నెలలుగా ముగ్గురూ కలిసి తనను మానసికంగా చిత్ర హింసలు పెడుతున్నారని ఆరోపించింది. అప్పటి నుంచి తనతో పాటు ఇద్దరు చిన్న పిల్లలను జైపూర్‌కాలనీలో వదిలేసి ముగ్గురూ తట్టిఅన్నారంలోని ఆర్‌కేనగర్‌లోని మరో ఇంట్లోకి మారినట్లు తెలిపింది. ఈనెల 1వ తేదీన సరూర్‌నగర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో భర్త అమరేందర్‌పై ఫిర్యాదు కూడా చేసింది. సోమవారం తట్టిఅన్నారంలోని భర్త ఇంటి ముందు పల్లవి ఇద్దరు పిల్లలతో వచ్చి ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఈ విషయం తెలుసుకున్న నాగోల్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెకు నచ్చజెప్పారు. మాట్లాడి న్యాయం జగిగేలా చూస్తామని చెప్పడంతో ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయింది.

బాలికను వేధించిన కేసులో నిందితుడికి జైలు, జరిమానా

- బాధితురాలికి నష్టపరిహారం

రంగారెడ్డి కోర్టులు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన కేసులో నిందితుడికి కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు. పీపీ సునీత బర్ల కథనం ప్రకారం ఇబ్రహీంపట్నం పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా, అదే గ్రామానికి చెందిన 19 సంవత్సరాల బాలుడు ప్రేమించాలని వేధించేవాడు. వాట్సాప్‌లో ఇద్దరూ కలిసినట్లు వీడియో సృష్టించి మెస్సేజ్ చేశాడు. తనని ప్రేమించకపోతే బాలిక తల్లిదండ్రుల అంతుచూస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాక్ష్యాధారాలతో సహా పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి నిందితుడికి 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమాన విధించడంతో పాటు బాధితురాలికి రూ.ఒక లక్ష నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

భవన నిర్మాణ లిఫ్ట్ పై నుంచి పడి కూలీ మృతి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మేస్త్రీ, ఇంటి యజమానిపై కేసు నమోదు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్లాబ్ నిర్మాణం సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక లిఫ్ట్ పై నుంచి కింద పడి కూలీ మృతి చెందిన సంఘటనలో ఇంటి యజమానితో పాటు మేస్త్రీపై నాగోల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సరూర్‌నగర్ శివగంగా థియేటర్ ఎదురుగా ఉన్న పోచమ్మ బస్తీలో పెద్ద బూడిది వెంకటేశ్(40), లక్ష్మి దంపతులు తమ ముగ్గురు కూతుళ్లతో కలిసి నివాసం ఉంటున్నారు. కొన్నేళ్లుగా దంపతులిద్దరూ భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తున్నారు.

ఐదేళ్లుగా మేస్త్రీ నయాబ్ రసూల్ వద్ద కాంక్రీట్ కూలీ పనిచేస్తున్నారు. పసుమాములలోని రేణుక వెంచర్‌లో నాగేశ్వరరావు చేపడుతున్న ఇంటి నిర్మాణానికి మేస్త్రీ నయాబ్ రసూల్‌తో కలిసి వెంకటేశ్ దంపతులు వెళ్తున్నారు. ఈనెల 5న స్లాబ్ నిర్మాణం ఉండగా.. వెంకటేశ్‌తో భార్య లక్ష్మి, ముగ్గురు కూతుళ్లు కూడా వెళ్లారు. అయితే స్లాబ్ నిర్మాణానికి తాత్కాలికంగా కాంక్రీట్ లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. స్లాబ్ నిర్మాణం పూర్తి కాగానే.. లిఫ్ట్‌కు ఏర్పాటుచేసిన కర్రలు తొలగించాలని వెంకటేశ్‌ను మేస్త్రీ రసూల్ ఆదేశించారు. ఈ క్రమంలో పైకి ఎక్కి కర్రలు తొలగిస్తుండగా.. కాలు జారి వెంకటేశ్ కింద ఇటుకలపై పడిపోయాడు. ఈ ఘటన సందర్భంగా మేస్త్రీ రసూల్, ఇంటి యజమాని తమకు పట్టనట్లు వ్యవహరించారు. కూలీలంతా కలిసి మొదట ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వారి సూచనతో నిమ్స్‌కు తరలించారు. మెడ భాగంలోని నరాలు దెబ్బతినటంతో పాటు తలకు గాయాలు కావటంతో.. చికిత్స పొందుతూ వెంకటేశ్ సోమవారం చనిపోయాడు. అయితే స్లాబ్ నిర్మాణం సందర్భంగా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహించినందుకు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేస్త్రీ రసూల్, ఇంటి యజమాని నాగేశ్వరరావులపై నాగోల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



కర్మన్‌ఘాట్ నుంచి నల్గొండ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, నాయకులు



చలో నల్గొండ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, నగేష్, సునితారెడ్డి తదితరులు